క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి

సి.బెళగల్: జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలను ఈఓఆర్డీ సందీప్ తదితరులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని అన్నారు. వీరి వెంట ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, ఏపీఓ లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్: కోడుమూరులోని 4, 5గ్రామ సచివాలయాల పరిధిలోని కాలనీల్లో బుధవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

గ్రామాలపై నిఘా పెంచండి

సి.బెళగల్: పోలీస్ సిబ్బంది, మహిళా కానిస్టేబుళ్లు గ్రామాలపై నిఘా పెంచాలని ఎస్‌ఐ పీరయ్య అన్నారు. మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో వారితో సమావేశం నిర్వహించి నేర సంఘటనలు, ప్రజల సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది గ్రామాలలో తరచూ పర్యటించి సమస్యలను గుర్తించాలన్నారు. దీంతో పల్లెల్లో ముందస్తు భద్రతా చర్యలు తీసుకునేందుకు వీలవుతుందన్నారు. అదేవిధంగా పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాలిబాష మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులతో పాటు, అనాథ, వికలాంగులు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలు అర్హులన్నారు. అదేవిధంగా పట్టణ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా https://aprs.apcfss.in/ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.110లు ప్రవేశ రుసుం చెల్లించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 2021–2023 మధ్య కాలంలో 3, 4వ తరగతి చదివిన విద్యార్థులు అర్హులన్నారు.

జేవీకే కిట్ల తనిఖీ

పాణ్యం: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన కిట్ల (జేవీకే) నిల్వలను జేవీకే రాష్ట్ర పరిశీలకులు ఏడీ ఎస్పీడీ శ్రీనివాసులు తనిఖీ చేశారు. మంగళవారం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీకే కిట్ల నిల్వల గదిని ఎంఈఓ కోటయ్య ఆధ్వర్యంలో పరిశీలించారు. కిట్లకు అవసరమైన గదులు, ఏ విధంగా సిద్ధం చేయాలి, పంపిణీలో ఎవరెవరు కమిటీ సభ్యులు ఉండాలనే అంశాలపై వివరించారు. పూర్తిస్థాయిలో కిట్లు వచ్చాక పంపిణీ ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం యశోద, యూనిస్, పుల్లన్న, రఘురామ్, శ్రీహరి, నాగరాజు, రాజశేఖర్, ఐఈఆర్‌టీ సాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఈ నెల 1వ తేదిన జగలి మహేంద్ర గుండెపోటుతో చనిపోయారు. అదేవిధంగా ఈనెల 7వ తేదీన ఎంబాయ్ మాధవకృష్ణ అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణసాయం కింద రూ.10 వేలు చొప్పున ఇరు కుటుంబాలకు మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు అందించారు. మిగిలిన సొమ్ము త్వరలోనే నామిని ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిరెడ్డి, శేషారెడ్డి, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రదర్శన పాదయాత్రను జయప్రదం చేయండి

కోడుమూరు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీన సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ప్రజాప్రదర్శన పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ కోరారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇష్టానుసారంగా పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచుకుంటూ పోతుండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రజా ప్రదర్శన పాదయాత్ర చేపడుతున్నామని, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు రాజు, గపూర్‌మియ్యా, నాయకులు తదితరులున్నారు.

ససేమిరా!

- శాలమ్మ సత్రం స్వాధీనం చేయని యాజమాన్యం
- పెద్దాసుపత్రి ఆదాయానికి గండి
- ఏడాది క్రితమే ముగిసిన లీజు గడువు
- అగ్రిమెంట్ ప్రకారం భవనాన్ని ఆసుపత్రికి అప్పగించాల్సి ఉన్నా పలకని వైనం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని కలెక్టరేట్ ప్రాంతం. నిత్యం రద్దీగా ఉంటుంది. నగరం నడిబొడ్డు కావడం, రాయలసీమ జిల్లాలకు పెద్ద దిక్కు అయిన పెద్దాసుపత్రి, కలెక్టరేట్ ఉన్న ఏరియా కావడంతో ఇక్కడ స్థలానికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇక్కడ ఉన్న కసిరెడ్డి వెంకటరెడ్డి శాలమ్మ సత్రం భవనం, స్థలం విలువ రూ.50కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ భవనం ఉన్న స్థలం గతంలో ప్రముఖ మిఠాయిల వ్యాపారి జి.పుల్లారెడ్డి వారిది. అప్పట్లో ఇందులో వారే ఓ చిన్న భవనాన్ని నిర్మించి ఆసుపత్రికి వచ్చే పేదరోగులు వంటావార్పు చేసుకుని, విశ్రమించే విధంగా నిర్వహించే వారు. ఇలాంటి ఈ స్థలాన్ని కొంతకాలానికి వారు ప్రభుత్వ ఆసుపత్రికి ఇచ్చేశారు. 21 ఏళ్ల క్రితం వారే ఆసుపత్రి అధికారులతో చర్చించి ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈ భవనం చుట్టూ దుకాణాలు ఉన్నాయి. మధ్యలో మాత్రం ఆసుపత్రికి వచ్చే రోగులు విశ్రమించే విధంగా గదులు నిర్మించారు. ఈ గదులను నామమాత్రపు రుసుముతో అద్దెకు ఇస్తున్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ వచ్చే ఆదాయాన్ని నిర్వహణ ఖర్చులు పోను భవనం నిర్వాహకులకు 60శాతం, ఆసుపత్రికి 40శాతం ప్రకారం వచ్చేటట్లు అప్పట్లో నిర్వాహకులు 20 ఏళ్లపాటు లీజుకు తీసుకున్నారు. ఈ ఒప్పందం ఇటీవల 2022 మార్చి 15వ తేదీతో ముగిసినట్లు పేర్కొంటూ జిల్లా కలెక్టర్‌కు ఆసుపత్రి వర్గాలు నివేదించాయి.

పెద్దాసుపత్రికి నామమాత్రపు ఆదాయం

కసిరెడ్డి వెంకటరెడ్డి శ్యాలమ్మ సత్రం పేరిట ఉన్న ఈ భవనంలో ప్రధాన రహదారివైపున ఉన్న దుకాణాలకు ప్రస్తుతం నెలకు ఒక్కో దుకాణానికి రూ.10వేల చొప్పున(ఎన్ని దుకాణాలుంటే అన్ని రూ.10వేలు), వెనుక వైపున ఉన్న దుకాణాలకు ఒక్కో దానికి రూ.6వేల చొప్పున అద్దె వసూలు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆసుపత్రికి లెక్కలు చూపారు. 20ఏళ్ల క్రితం ఉన్న అద్దెలను ప్రతి మూడేళ్లకు ఒకసారి పెంచుతూ వస్తుండటంతో ప్రస్తుతం ఈ అద్దెలు వసూలవుతున్నాయని పేర్కొన్నారు. ఒక్కో వ్యాపారి వారి వ్యాపారాన్ని బట్టి రెండు, మూడు, నాలుగు దుకాణాలను కలిపి తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఈ ప్రాంతంలో షాపుల అద్దె దీనికి రెండు, మూడింతలు ఉంటుందన్నది బహిరంగ రహస్యం. ఈ గదుల అద్దెలు, విశ్రాంతి గదుల ద్వారా వచ్చే ఆదాయం కలిపి ఏడాదికి రూ.7లక్షలు మాత్రమే ఆసుపత్రికి ఇస్తుండటం గమనార్హం.


ఆసుపత్రి ఎదురుగా ఉన్న కసిరెడ్డి వెంకటరెడ్డి శాలమ్మ సత్రం భవనం

భవనం అప్పగించేందుకు ససేమిరా..

కసిరెడ్డి వెంకటరెడ్డి శాలమ్మ సత్రం లీజు గడువు ముగిసి ఏడాది దాటింది. ఈ మేరకు భవనాన్ని తమకు స్వాధీనం చేయాలని ఆసుపత్రి అధికారులు ఏడాది క్రితమే నిర్వాహకులకు నోటీసులు పంపించారు. అప్పటి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సైతం ఈ విషయమై చర్చించారు. భవనాన్ని అప్పగించకుండా జి.పుల్లారెడ్డి ట్రస్ట్ వారే దానిని నిర్వహించేలా, వచ్చే ఆదాయంలో 25శాతం ట్రస్ట్‌కు, 75శాతం ఆసుపత్రికి చెందే విధంగా నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసింది. కానీ ఏడాది దాటినా ఇప్పటి వరకు భవనాన్ని అప్పగించనూ లేదు. లేదా కొత్త ఒప్పందాన్ని అమలు చేయనూ లేదు. దీంతో ప్రతి యేటా ఆసుపత్రి తనకు రావాల్సిన ఆదాయాన్ని భారీగా కోల్పోతోంది.

జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

శాలమ్మ సత్రం భవనం తమకు స్వాధీనం చేయాలని ఏడాది క్రితమే నిర్వాహకులకు నోటీసులు ఇచ్చాము. ఈ విషయమై అప్పటి జిల్లా కలెక్టర్ వద్ద చర్చలు కూడా జరిగాయి. కానీ నిర్ణయం తాలూకు ఫైలు పెండింగ్‌లో ఉంది. జిల్లా కలెక్టర్ నుంచి వచ్చే ఆదేశాలను బట్టి నిర్ణయం తీసుకుంటాము. అది ఆసుపత్రికి చెందాల్సిన భవనం కాబట్టి తిరిగి ఇస్తే దానిని అభివృద్ధి చేసుకుంటాం.–డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

13న మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఈ నెల 13వ తేదీ(గురువారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగే సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కావున వివిధ శాఖలకు సంబంధించి అధికారులు ఆయా శాఖల గత మూడు నెలలలో సాధించిన ప్రగతి, చేపట్టాల్సిన లక్ష్యాల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

19న బండలాగుడు పోటీలు

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడు జాతరను పురస్కరించుకొని ఈ నెల 19న వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర స్థాయి న్యూ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు న్విహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.50 వేలును మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, రెండవ బహుమతి రూ.40 వేలు వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్, మూడవ బహుమతి రూ.30 వేలు పత్తి రంగడు, నాల్గవ బహుమతి రూ.20 వేలు మాజీ జెడ్పీటీసీ మెంబర్ ఎల్.వెంకటేశ్వర్లు, 5వ బహుమతి రూ.10 వేలు జె.శ్రీకాంత్, 6వ బహుమతి రూ.5 వేలు ఇ.క్రాంతిగౌడ్‌లు అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 73960 19991, 99499 87713 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యాన్ని నెరవేర్చాలి

కోడుమూరు రూరల్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో లద్దగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజకలందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డా.రామగిడ్డయ్య మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఓపీకి వచ్చిన రోగులందరికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేయాలన్నారు. మధ్యాహ్న సమయంలో ఆరోగ్యశ్రీ కింద ఆయా గ్రామాల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారిని సందర్శించి వైద్య సేవలందించాలన్నారు. అలాగే ఆశా, ఆరోగ్య కార్యకర్తలు కూడా వారి ఆరోగ్య పరిస్థితి వాకబు చేస్తూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. గ్రామాల్లోని గర్భవతులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే ప్రసవానికి వారం ముందే ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. అనంతరం లద్దగిరి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.


లద్దగిరి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య

జామచెట్లు దగ్ధం

కల్లూరు: మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో సోమవారం సుందర్ రామిరెడ్డి తోటలోని జామచెట్లు అగ్నికి దగ్ధమయ్యాయి. రైతు జామతోట చుట్టూ ముళ్ల కంపను రక్షణగా పెట్టుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో 25 చెట్లు కాలిబుడిదయ్యాని బాధిత రైతు వాపోయాడు. సుమారు రూ. 50 వేలు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తమ్మరాజుపల్లెలో ఉచిత వైద్య శిబిరం

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో కర్నూలు మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన ఈసీ తదితర పరీక్షలు సుమారు 130మందికి పైగా చేశారు.అలాగే దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్లు ప్రవీణ్, మహేశ్వరరెడ్డి తెలిపారు. వేసవి కాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీలారెడ్డి, కొండారెడ్డి, ప్రశాంత్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే సీఎం లక్ష్యం


మహిళలతో ముఖాముఖీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- స్టాంటన్‌పురంలో మహిళలతో ముఖాముఖి

కర్నూలు (న్యూటౌన్): మహిళల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్టాంటన్‌పురంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర బీఈడీ కళాశాలలో మహిళలతో ఎమ్మెల్యే ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి లక్షాధికారులు కావాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే అమ్మఒడి, జగనన్న విద్యా, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల్లో అతివలకు పెద్దపీట వేస్తూ మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి నిలిచారని అన్నారు. మహిళలకు ఉద్యోగాల్లో, కాంట్రాక్టు పనుల్లో, రాజకీయ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ నాయకులకు లంచాలు ఇచ్చి వారి సిఫారసు చేస్తేనే పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పారదర్శక పాలనలో నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధిని అందిస్తున్నారని కొనియాడారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే 2024 ఎన్నికల్లో అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే కోడుమూరు ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాయికృప గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కమలాబాయి, పొదుపు గ్రూపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.


పంచలింగాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే

పంచలింగాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందించారు. కార్యక్రమంలో కర్నూలు మండల ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ–2 నెహేమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏఈఓ మోహన్‌రెడ్డి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మూలపెద్దమ్మ ఆలయం భక్తులతో కిటకిట

గడివేముల: గడివేముల మూలపెద్ద అమ్మవారి జాతర సందర్భంగా మూడో మంగళవారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్‌లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూలపెద్దమ్మను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో గడివేముల పాతబస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య సిబ్బందితో కలిసి చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా నంద్యాల–నందికొట్కూరు రహదారిలో భారీ వాహనాలు రాకుండా గ్రామ శివార్లలో నిలిపివేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గడివేములలో వెలసిన మూలపెద్దమ్మను మంగళవారం వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రజల ఇబ్బందులను తీర్చి వారికి సుఖసంతోషాలివ్వాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ చిన్నన్న, ఉప సర్పంచ్ బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.


భక్తులతో రద్దీగా ఉన్న మూల పెద్దమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం

25న ముగియనున్న జాతర ఉత్సవాలు

గత నెల 23న ప్రారంభమైన మూలపెద్దమ్మ జాతర ఉత్సవాలు ఈ నెల 25న ముగియనున్నట్లు ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్‌లు మంగళవారం తెలిపారు. అమ్మవారిని ప్రతి మంగళ, ఆదివారాల్లో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారని, ఇంకా ఎవరైనా ఉంటే అమ్మవారికి మొక్కులు తీర్చుకోవాలన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

- శరీన్‌నగర్‌లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని, కలెక్టర్ సృజన

కల్లూరు: మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై కృషి చేసి గొప్ప సాంఘిక విప్లవకారుడని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని హాజరై పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సమాజంలో వెనుకబడిన తరగతులకు, మహిళల విద్య కొరకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్యం, మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ పరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జయరాముడు, డీఏఏబి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు జే లక్ష్మినరసింహ యాదవ్ అన్నారు. నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య భవనంలో పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హరిజన బాలస్వామి, నాయకులు పఠాన్ హబిబ్ ఖాన్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.


శరీన్ నగర్‌లో జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పూలే చిత్రపటానికి ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక జెడ్పీహైస్కూల్‌లో హెచ్‌ఎం దస్తగిరమ్మ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ అబ్దుల్‌ఖాలీక్, సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు అధ్యక్షతన పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ సందీప్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పుల్లయ్య, సిబ్బంది మంజుల, ఉదయ్, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్ ఉపాధిహామీ ఏపీఓ లక్ష్మన్న పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

కోడుమూరు రూరల్: జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో స్థానిక వార్డు సభ్యులు, ఉపసర్పంచు మాదులుతో కలిసి సర్పంచు భాగ్యరత్న పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓ అజయ్‌భాస్కర్, ఎమ్మార్పీఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు ఆంథ్రయ్య, గఫూర్‌మియ్యా, రాజు, వార్డు సభ్యులు ప్రతాప్‌రెడ్డి, రవి, అడ్వకేట్ సోమశంకర్ యాదవ్, రాముడు తదితరులున్నారు.


గూడూరులో పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ మెంబర్ ఎల్.వెంకటేశ్వర్లు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ రవికుమార్, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జే.ఆబేలు, కౌన్సిలర్లు దస్తగిరి, పి.రామాంజనేయులు, బజారి, మద్ది, బాస్కర్, సత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం


మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): మహాత్మాజ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సచివాలయంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనాడు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, అంటరానితనం, బాల్యవివాహాలు, తదితర రుగ్మతల నిర్మూలన కోసం పూలే ఎంతో కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా మహిళల విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారని, తన సతీమణి సావిత్రీబాయి పూలే దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా చేసి ఎందరో మహిళలకు అక్షరాభ్యాసం చేయించారన్నారు. ఆయన చూపిన మార్గంలో మనమందరం నడవాలని పిలుపునిచ్చారు. పూలేను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. అదేవిధంగా విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు రవిశాస్త్రి, ఎరుకల రాజు, రమేష్‌బాబు, ప్రభుదాసు, ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి బషీరున్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్‌బాబు పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.